సాక్షి
అనకాపల్లి
మంగళవారం । 15 । ఆగస్టు । 2023



ప్రజారోగ్యానికి పెద్ద పీట

మంత్రి అమర్‌నాథ్‌ వేటజంగాలపాలెంలో విలేజ్‌ హెల్త్‌ క్లినిక్‌, సుందరయ్యపేటలో వెల్‌నెస్‌ సెంటర్‌లను ప్రారంభించారు. IIలో



ఏయూ ప్రగతి అమితానందం

విశాఖ: అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్‌ కాన్సాస్‌ డైరెక్టర్‌ అశ్వినీకుమార్‌ ఏయూని సందర్శించి, ఇక్కడి ప్రగతిని అభినందించారు.

స్వల్ప వర్షసూచన

అనకాపల్లి టౌన్‌: రాగల ఐదు రోజులు స్వల్ప వర్షసూచన ఉందని ఆర్‌ఏఆర్‌ఎస్‌ వాతావరణ విభాగం శాస్త్రవేత్త ఎంజీజీఎస్‌ కుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15న 6 మి.మీ., 16న 3, 18న 3, 19న 6 మి.మీటర్ల వర్షపాతం కురిసే అవకాశం ఉందని, 33.8 నుంచి 34.6 ఉష్ణోగ్రతలు నమోదవుతాయని చెప్పారు.



త్రివర్ణ విద్యుత్‌ కాంతులతో కళకళలాడుతున్న కలెక్టరేట్‌



ముస్తాబైన ఎన్టీఆర్‌ స్టేడియం ముఖద్వారం



స్టేడియంలో సిద్ధమైన సభావేదిక

జెండా పండగకు సర్వం సిద్ధం

- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి రాజన్నదొర

అనకాపల్లి టౌన్‌/తుమ్మపాల: స్వాతంత్య్ర దినోత్సవానికి జిల్లా కేంద్రం అనకాపల్లి ముస్తాబైంది. ఎన్టీఆర్‌ స్టేడియంలో జరిగే కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర ముఖ్యఅతిథిగా పాల్గొని మంగళవారం ఉదయం 9 గంటలకు పతాకావిష్కరణ చేస్తారని కలెక్టర్‌ రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల శకటాల ప్రదర్శన అనంతరం ప్రభుత్వ ఉద్యోగులు, వివిధ స్వచ్ఛంద సంస్థలకు ప్రతిభా పురస్కారాలు అందిస్తారన్నారు. నూతన జిల్లాగా ఏర్పడిన తర్వాత అనకాపల్లిలో ఇది రెండో స్వాతంత్య్ర దినోత్సవం. దీనికోసం స్టేడియంను సర్వాంగ సుందరంగా అలంకరించారు. 56 ప్రభుత్వ శాఖల స్టాళ్లు, ప్రభుత్వ శాఖల శకటాలు ప్రదర్శనకు సిద్ధమయ్యాయి. జాతిపిత మహాత్మాగాంధీ అనకాపల్లి వచ్చినప్పుడు ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన ప్రదేశంలోనే (అప్పటి మున్సిపల్‌ క్రీడా మైదానం) స్వాతంత్య్ర దినోత్సవ ప్రధాన కార్యక్రమం నిర్వహించడం విశేషం.

త్రివర్ణ శోభితం

- వెల్లివిరిసిన జాతీయ భావం
- వెయ్యి అడుగుల జాతీయ పతాకంతో భారీ ర్యాలీ
- మువ్వన్నెల రెపరెపలతో దేవరాపల్లి పరిసరాలు

దేవరాపల్లి: వెయ్యి అడుగుల అతి పెద్ద జాతీయ జెండా.. విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులతో భారీ ర్యాలీ.. ప్రదర్శన ముందు స్వాతంత్య్ర సమరయోధుల వేషధారణలో ప్రత్యేక ఆకర్షణగా చిన్నారులు.. వెరసి మువ్వన్నెల జెండా రెపరెపలతో దేవరాపల్లి మురిసిపోయింది. 77వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో వెయ్యి అడుగుల జాతీయ పతాకంతో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి ఎన్‌సీసీ కవాతు నడుమ ప్రధాన రహదారిలో సినిమా థియేటర్‌ వరకు ప్రదర్శన సాగింది. భారతమాత, మహాత్మాగాంధీ, జవహర్‌లాల్‌ నెహ్రూ, డా. బి.ఆర్‌.అంబేడ్కర్‌, ఝాన్సీ లక్ష్మీబాయి, సావిత్రిబాయి పూలె తదితర వేషధారణలతో చిన్నారులు మురిపించారు. భారత్‌మాతాకీ జై, మేరా భారత్‌ మహాన్‌, జై కిసాన్‌ జై జవాన్‌ అంటూ నినాదాలు చేశారు. ముందుగా నాలుగు రోడ్ల కూడలిలోని డా.అంబేడ్కర్‌ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ కర్రి సత్యం, ఎంపీడీవో సిహెచ్‌.సుబ్బలక్ష్మి, తహసీల్దార్‌ ఎం.లక్ష్మి, ఎంఈవో–1 వి.వడాల్‌దాస్‌, ఎంఈవో–2 వి.ఉషారాణి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కె.వి.రమణ, ఐక్యవేదిక మండల అధ్యక్షుడు కొరుపోలు శ్రీను పాల్గొన్నారు.



దేవరాపల్లిలో ప్రదర్శించిన వెయ్యి అడుగుల జాతీయ పతాకం



దిమిలి ప్రాథమిక పాఠశాలలో విజయ స్థూపం

స్వాతంత్య్రయోధుల లోగిలి దిమిలి

రాంబిల్లి: దిమిలి గ్రామం స్వాతంత్య్ర సమరయోధుల గ్రామంగా చరిత్రకెక్కింది. స్వాతంత్య్ర పోరాటంలో ఈ గ్రామానికి చెందిన పలువురు పాల్గొని జైలు శిక్ష అనుభవించారు. జైలులో ఉండగా సంతానం కలగడంతో స్వాతంత్య్రంపై మమకారంతో ఏకంగా దిమిలి గ్రామానికి చెందిన మిస్సుల వీర వెంకట సత్యనారాయణ (చిరంజీవి), లక్ష్మి నర్సమ్మ దంపతులు వారికి జన్మించిన ఇద్దరు కుమార్తెలకు స్వరాజ్యం, భారతి పేర్లు పెట్టారు. శిష్ట రామదాసు, శిష్ట శ్యామసుందరమ్మ, శిష్ట పురుషోత్తం, లక్ష్మీనర్సమ్మ, శిష్ట కామేశ్వరరావు, శిష్ట యశోద, శిష్ట లింగమ్మ, సేనాపతి అప్పలనాయుడు, డబ్బీరు శశిపతిరావు, డబ్బీరు భారతీరావుతోపాటు ఎందరో దిమిలి గ్రామానికి చెందిన పోరాటయోధులు స్వాతంత్య్ర సమరంలో పాల్గొన్నారు. ఉప్పు సత్యాగ్రహం, సహాయ నిరాకరణ, క్విట్‌ ఇండియా ఇతర ఉద్యమాల్లో బ్రిటిష్‌ పాలకులను ఎదిరించి పోరాడి రియల్‌ హీరోలుగా నిలిచారు. భారత ప్రభుత్వం స్వాతంత్య్రం సిద్ధించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దిమిలి ప్రాథమిక పాఠశాల ఆవరణలో సమరయోధుల విజయ స్థూపాన్ని ఏర్పాటు చేసింది. ఇండియన్‌ ఇండిపెండెంట్‌ హిస్టరీ పుస్తకంలో దిమిలి గ్రామానికి ఒకటిన్నర పేజీ చోటు దక్కడం గొప్ప విషయమని పలువురు చెబుతుంటారు.



విసన్నపేట గ్రామం

జై జవాన్‌.. జై కిసాన్‌

కశింకోట: మండలంలోని విసన్నపేట గ్రామం ప్రత్యేకమైంది. గ్రామం అంతటా దాదాపుగా ఆర్మీ ఉద్యోగులే. జై జవాన్‌ అంటూ ఇక్కడ కనీసం ఇంటికొకరు ఆర్మీ ఉద్యోగం చేస్తూ దేశానికి సేవలందిస్తున్నారు. ఉద్యోగం అనంతరం జై కిసాన్‌ అంటూ వ్యవసాయం సాగులో నిమగ్నమవుతున్నారు. సుమారు 1200 జనాభా కలిగిన విసన్నపేట గ్రామంలో వందేళ్ల క్రితం నుంచి ఆర్మీ ఉద్యోగాలు చేసి దేశానికి సేవలందిస్తూ వస్తున్నారు. బ్రిటిష్‌ పాలకుల హయాంలో సైతం సైన్యంలో సేవలందించారు. సిపాయి మొదలుకొని సుబేదార్‌ ర్యాంకు వరకు వివిధ హోదాల్లో విధులు నిర్వహించారు. ఇంటికి ఒక్కరైనా ఆర్మీ ఉద్యోగి ఉండటం గ్రామం ప్రత్యేకత. గ్రామంలో ఐదుగురు సుబేదార్‌ హోదాలో పని చేశారు. ప్రస్తుతం నడిశెట్టి గణేష్‌ మేజర్‌గా ఉన్నత హోదాలో పని చేస్తున్నారు. ఉప్పనూరి అచ్చిలనాయుడు కుమారులు నలుగురు కూడా ఆర్మీలో ఉద్యోగాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు వెయ్యి మంది గ్రామం నుంచి ఆర్మీలో విధులు నిర్వహించారు. ప్రస్తుతం సుమారు 70 మంది దేశంలోని వివిధ ప్రాంతాల్లో వివిధ హోదాల్లో సేవలందిస్తున్నారు.

న్యూస్‌రీల్‌

బుచ్చెయ్యపేట సర్పంచ్‌ ఏకగ్రీవం




లక్ష్మికి నియామక పత్రం అందిస్తున్న ఎన్నికల రిటర్నింగ్‌ అధికారి

బుచ్చెయ్యపేట: మండల కేంద్రం బుచ్చెయ్యపేట సర్పంచ్‌గా సుంకర లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏడాది క్రితం ట్రాక్టర్‌ ప్రమాదంలో ఇక్కడి సర్పంచ్‌ సుంకరి సూరిబాబు మృతి చెందారు. ఉప ఎన్నికల్లో అతడి భార్య లక్ష్మికి మద్దతుగా గ్రామస్తులు తీర్మానించారు. దాంతో సర్పంచ్‌గా ఆమె ఒక్కరే నామినేషన్‌ వేశారు. పోటీలో ఎవరూ లేకపోవడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల రిటర్నింగ్‌ అధికారి కామేశ్వరరావు ప్రకటించారు. సోమవారం సాయంత్రం నియామక పత్రాన్ని అందించారు.

వార్డు మెంబర్లు ఏకగ్రీవం

గొలుగొండ మండలం సిహెచ్‌.నాగాపురం ఏడో వార్డు మెంబర్‌గా జర్రా లోవకుమార్‌, కె.కోటపాడు మండలం ఆర్లి గ్రామ పంచాయతీ ఆరో వార్డు సభ్యునిగా బండారు కిశోర్‌కుమార్‌ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దేవరాపల్లి మండలం ఎస్‌.గజపతినగరం మూడో వార్డు మెంబర్‌గా ఆదిరెడ్డి సన్యాసమ్మ, నాగయ్యపేట ఏడో వార్డు సభ్యురాలిగా సింగంపల్లి సత్యవతి ఎన్నిక ఏకగ్రీవమైంది. నాగయ్యపేట మినహా మిగతావారు వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థులు. రాంబిల్లి మండలం కుమ్మరాపల్లి పంచాయతీ వార్డు మెంబరుగా వైఎస్సార్‌సీపీ మద్దతుదారు బి.లోవతల్లి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఢిల్లీ వేడుకలకు బంగారయ్యపేట మత్స్యకారుడు



నక్కపల్లి: మండలంలో బంగారయ్యపేట గ్రామానికి చెందిన మత్స్యకారుడు కొవిరి రమణకు ఢిల్లీలో జరిగే పంద్రాగస్టు వేడుకలకు ఆహ్వానం అందింది. ఈ వేడుకలకు 50 మంది మత్స్యకారులను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. వీరిలో బంగారయ్యపేటకు చెందిన ఫిషర్‌మెన్‌ సొసైటీ మాజీ అధ్యక్షుడు కొవిరి రమణ ఉన్నారు. ఇతను సోమవారం బయలుదేరి ఢిల్లీ వెళ్లాడు.

విసన్నపేటలో విసవిసలు

దత్తపుత్రుడి ప్లాన్‌ అట్టర్‌ప్లాప్‌

- భూ ఆక్రమణ జరిగిందంటూ గగ్గోలు
- పట్టించుకోని గ్రామస్తులు
- ఫిర్యాదు చేయకపోవడంతో పవన్‌ కల్యాణ్‌కు నిరాశ
- పార్టీ శ్రేణులను పలకరించకుండానే తిరుగు పయనం
- నాలుగు గంటలు వేచి ఉన్నా ఫలితం లేదని కార్యకర్తల నిట్టూర్పు



మీడియాతో మాట్లాడుతున్న పవన్‌ కళ్యాణ్‌



ట్రాఫిక్‌ను క్లియర్‌ చేస్తున్న పోలీసులు

సాక్షి, అనకాపల్లి: విసన్నపేట భూముల అంశాన్ని భూతద్దంలో చూపించాలనుకున్న పవన్‌ కల్యాణ్‌ ఆశలు అడియాసలయ్యాయి. కనీసం ప్రజలతో, పార్టీ శ్రేణులతో మాట్లాడకుండానే ఆయన వెనుదిరిగారు. వెరసి కశింకోట మండలానికి సోమవారం జనసేన అధ్యక్షుడు చేపట్టిన వారాహి యాత్ర విఫలమైంది. విసన్నపేట గ్రామస్తులెవరూ తమ భూములను ఆక్రమించుకున్నట్టు ఫిర్యాదు చేయకపోవడంతో దత్తపుత్రుడికి నిరాశ ఎదురైంది. ఈ అంశాన్ని గ్రామస్తులెవరూ పట్టించుకోకపోవడంతో స్థానిక జనసేన నాయకులను కూడా కలవలేదు. మీడియా వ్యాన్‌ మీదకు వచ్చి అక్కడే ఐదు నిమిషాలపాటు మాట్లాడి వెళ్లిపోయారు. కనీసం మీడియా అడిగిన ప్రశ్నలకు కూడా సమాధానం చెప్పకుండా వ్యాన్‌ దిగిపోయారు. ఉదయం 11 గంటలకు పర్యటనకు రానున్నారని ముందుగా ప్రకటించినప్పటికీ ఆయన నాలుగు గంటలు ఆలస్యంగా వచ్చారు. మధ్యాహ్నం 3.15 గంటల ప్రాంతంలో విసన్నపేటకు చేరారు. దీంతో ఉదయం నుంచి పవన్‌ కల్యాణ్‌ కోసం నిరీక్షించిన పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

మూడున్నర గంటలపాటు నిలిచిన ట్రాఫిక్‌

పవన్‌ కల్యాణ్‌ రాకతో మారేడుపూడి నుంచి కశింకోట విసన్నపేట జంక్షన్‌ వరకూ జాతీయ రహదారిపై ట్రాఫిక్‌ నిలిచిపోయింది. వాహనదారులు పలు ఇబ్బందులకు గురయ్యారు. వాహనంపై నుంచి అభివాదం చేయడానికి అనుమతి లేకున్నా హైవేపై పలుచోట్ల నిలిపివేయడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. దాదాపుగా మూడున్నర గంటల పాటు ట్రాఫిక్‌ సమస్య ఏర్పడింది. అంతేకాకుండా జనసేన కార్యకర్తలు జాతీయ రహదారిపై రెండు మార్గాల గుండా రాంగ్‌ రూట్‌లో వెళ్లడంతో వాహదారులు ఇబ్బందులకు గురయ్యారు. చోడవరం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి కారు రాంగ్‌ రూట్‌లో అతివేగంతో వెళ్లడంతో ప్రమాదం జరిగాల్సింది. త్రుటిలో తప్పింది.

ఎందుకు వచ్చాడో...ఎందుకు వెళ్లాడో..

విసన్నపేటలో అసైన్డ్‌, ప్రభుత్వ భూములను ఆక్రమించారనే ఆరోపణలతో తమ అధినేత పవన్‌ కల్యాణ్‌ వస్తున్నారని ఉదయం 11 గంటల నుంచే జనసేన కార్యకర్తలు, పార్టీ నాయకులు వేచి ఉన్నారు. కానీ అక్కడకు వచ్చిన పవన్‌ కల్యాణ్‌ ఒకసారి కారు పైకి వచ్చి అభివాదం చేశారు. వెనువెంటనే మీడియాతో మాట్లాడి తిరుగు ముఖం పట్టారు. అధినేతను కలుద్దామని వేచి ఉన్న నియోజకవర్గ జనసేన నేతల సమయమంతా వృథా అయిపోయినట్లయింది. రెండు రోజులుగా కటౌట్లు కడుతూ.. హడావుడి పడ్డ నాయకులు, కార్యకర్తలు తమ నేత కలవకపోవడం, కనీసం పుష్పగుచ్ఛం కూడా తీసుకోకపోవడంతో నిరాశకు లోనయ్యారు. ఇటీవల వరకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసి తనకు గౌరవం దక్కలేదని జనసేన తీర్థం తీసుకున్న పంచకర్ల రమేష్‌బాబుని కూడా జనసేన అధినేత కలవలేదు.

జై జగన్‌ అంటూ నినాదం..

పవన్‌ కళ్యాణ్‌ రాక సందర్భంగా జై పవర్‌స్టార్‌ అంటూ అభిమానులు అరుస్తుండగా.. మధ్యలో ఒకరిద్దరు యువకులు జై జగన్‌ అంటూ నినాదం చేశారు. దీంతో స్థానిక జనసేన నాయకులు ఆ కుర్రాళ్ల దగ్గరికి వెళ్లి అలా అనకూడదని చెప్పారు.

కల్యాణపులోవ కళకళ



నీరు విడుదల చేస్తున్న ధర్మశ్రీ



ఆయకట్టు భూములకు వడివడిగా సాగుతున్న నీరు

- లాంఛనంగా నీరు విడుదల
- రూ.2.6 కోట్లతో పర్యాటకంగా అభివృద్ధి
- ప్రభుత్వ విప్‌ కరణం ధర్మశ్రీ

రావికమతం: కల్యాణపులోవ రిజర్వాయర్‌ నీటిని ప్రభుత్వ విప్‌ కరణం ధర్మశ్రీ సోమవారం లాంఛనంగా విడుదల చేశారు. వరుసగా నాలుగేళ్ల పుష్కలంగా పంటలు పండించిన తల్లి ఈ ఏడాదీ రైతుల ఇంట సిరులు కురిపించాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అధికారులు, సిబ్బంది కాలువలపై నిత్యం పర్యవేక్షణ చేసి నీరు వృథా కాకుండా చూడాలని ఆయన ఆదేశించారు. పర్యాటకంగా ఆకట్టుకుంటున్న కల్యాణపులోవ రిజర్వాయర్‌ వద్ద రూ.2 కోట్ల 60 లక్షలతో పలు అభివృద్ధి పనులను చేపట్టనున్నట్టు ధర్మశ్రీ చెప్పారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబును ఇటీవల కలిసి పలు జిల్లాల నుంచి భక్తులు హాజరయ్యే కల్యాణపులోవ తిరుణాళ్ల గురించి వివరించానని చెప్పారు. రిజర్వాయర్‌ వద్ద స్నానాల రేవు ఆవశ్యకత, ఇతర అభివృద్ధి పనుల గురించి తెలపగా మంత్రి రూ.2 కోట్ల 60 లక్షల ప్రత్యేక నిధులు మంజూరు చేశారన్నారు. ఈ నిధులతో రిజర్వాయర్‌ గట్టుపై పూర్తిస్థాయిలో సిమెంటు రహదారి వేస్తామని, గట్టుపై లైటింగ్‌, బ్యూటిఫికేషన్‌ పనులు చేపడతామన్నారు. పోతురాజుబాబు ఆలయం వద్ద రూ.80 లక్షల టీటీడీ నిధులతో మండపం నిర్మాణం, కాశీ నుంచి తీసుకువచ్చిన నూతన శివలింగం ఏర్పాటు, ప్రహరీ నిర్మాణం, ఆలయం నుంచి రిజర్వాయర్‌ గట్టు రహదారి వరకూ సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టినట్టు చెప్పారు.

రూ.40 లక్షలతో కాలువల సమస్యకు పరిష్కారం

పదేళ్లుగా రిజర్వాయర్‌ కాలువలకు పట్టిన పూడిక సమస్యకు, పాడైన అక్విడెక్ట్‌లకు రూ.40 లక్షలతో మరమ్మతులు చేపట్టామని ధర్మశ్రీ చెప్పారు. ప్రధాన కాలువతోపాటు పిల్ల కాలువల్లో ఆరడుగుల మేర పేరుకుపోయిన తుప్పలను తొలగించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పైల రాజు, జెడ్పీటీసీ తలారి రమణమ్మ ఆదిమూర్తి, డీసీఎంఎస్‌ డైరెక్టర్‌ గుమ్ముడు సత్యదేవ, సర్పంచ్‌ వంజరి గంగరాజు, ఎంపీటీసీ చిన్ని చినమ్మలు, తహసీల్దార్‌ మహేశ్వరరావు, ఇరిగేషన్‌ డీఈ స్వామినాయుడు, ఏఈ సత్యనారాయణదొర, ఆయకట్టు కమిటీ నాయకులు గర్రెడ్డి రామునాయుడు, రాజారావు, తాతబాబు, అబ్బాయిరమణ, మండల సచివాలయ కన్వీనర్‌ కంచిపాటి జగన్నాథరావు పాల్గొన్నారు.

అన్నదాతకు వందనం

చిరు ధాన్యాలతో సందేశాత్మక చిత్రం

ఏయూ క్యాంపస్‌: దేశ ప్రజల ఆకలి తీర్చే అన్నదాతల రుణం ఏమిచ్చి తీర్చుకోగలం. సైనికులు, రైతులు దేశానికి రెండు కళ్లవంటివారు. సైనికులు దేశ సరిహద్దులో రక్షణగా నిలబడి ప్రజల ప్రాణాలను నిరంతరం పరిరక్షిస్తుంటారు. రైతన్నలు ఎండనక, వాననక ఆహారాన్ని పండించే క్రతువును నిర్వర్తిస్తుంటారు. వీరిద్దరినీ గౌరవిస్తూ నగరానికి చెందిన చిత్రకారుడు మోకా విజయ్‌ కుమార్‌ మిల్లెట్స్‌ (చిరు ధాన్యాలు), కొద్దిపాటి రంగులు ఉపయోగించి సందేశాత్మక చిత్రం తీర్చిదిద్దారు. ఇందులో నాగలి పట్టిన రైతన్న చిత్రాన్ని మిల్లెట్స్‌తో తయారు చేశారు. కిందన మన దేశంలో పండే చిరుధాన్యాల పంటలను నేలపై పరిచి, పంటగా చూపారు. 80 శాతం మిల్లెట్స్‌, 20 శాతం వర్ణాలను అద్ది దీనిని తీర్చిదిద్దారు. ప్రధాని నినాదం మై సాయిల్‌ – మై కంట్రీ, సెల్యూట్‌ టు ది సాయిల్‌ – సెల్యూట్‌ టు ది బ్రేవ్‌ అనే సందేశాన్ని ఇందులో పొందుపరిచారు. 2023 సంవత్సరాన్ని ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించింది. దీనిని దృష్టిలో ఉంచుకుని రైతులను ప్రోత్సహించాలని, చిరుధాన్యాలకు ప్రాచుర్యం కల్పించాలనే ఉద్దేశంతో ఈ చిత్రాన్ని తీర్చిదిద్దారు. ఈ చిత్రపటాన్ని కలెక్టర్‌కు బహూకరించనున్నట్లు విజయ్‌కుమార్‌ తెలిపారు.



మిల్లెట్స్‌తో విజయకుమార్‌ తీర్చిదిద్దిన చిత్రం

ప్రైవేటుకు దీటుగా కేజీహెచ్‌లో వైద్య సేవలు

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని

మహారాణిపేట (విశాఖ): కేజీహెచ్‌లో మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి రూ.30 లక్షల వ్యయంతో 15 అదనపు పడకలతో అత్యవసర చికిత్స విభాగం అందుబాటులోకి తీసుకొచ్చామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని పేర్కొన్నారు. కేజీహెచ్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను సోమవారం సాయంత్రం ఆమె ప్రారంభించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రపంచ స్థాయి సదుపాయాలు కల్పించేలా ఆరోగ్య శాఖ 24 గంటలూ పని చేస్తోందన్నారు. ఆంధ్ర మెడికల్‌ కాలేజీ వంద సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న తరుణంలో రూ.36 లక్షల ఖర్చుతో గ్రాండ్‌ సెంటినరీ ఆర్చ్‌ ప్రారంభించామన్నారు. మొత్తంగా రూ.66 లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులు ప్రారంభించామని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి ఆదేశాల మేరకు ఆంధ్ర మెడికల్‌ కాలేజీలో రూ. 600 కోట్లతో 'నాడు – నేడు'లో భాగంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. రూ.73 కోట్లతో పీజీ హాస్టల్స్‌ నిర్మాణం, రూ.79 కోట్లతో వైద్య పరికరాలు సమకూర్చడం, రూ.12 కోట్లతో ఎంఆర్‌ఐ స్కాన్‌కు సంబంధించి పరికరాలకు ఆర్డర్‌ ఇచ్చామన్నారు. రూ.4 కోట్లతో సిటీస్కాన్‌ను కొనుగోలు చేస్తామన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రైవేటు ఆస్పత్రులకు దీటుగా కేజీహెచ్‌లో వైద్య సేవలు అందుతున్నాయన్నారు.




గ్రాండ్‌ సెంటినరీ ఆర్చ్‌ ప్రారంభిస్తున్న మంత్రి విడదల రజిని. ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

రూ.10 కోట్ల సీఎస్సార్‌ నిధులతో అభివృద్ధి

జిల్లా కలెక్టర్‌ డాక్టర్‌ మల్లికార్జున మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి ఆదేశాలతో కేజీహెచ్‌లో గత సంవత్సర కాలంలో రూ.10 కోట్ల సీఎస్‌ఆర్‌ నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. పది అంబులెన్స్‌లు నెల రోజుల్లో రానున్నాయని తెలిపారు. హెచ్‌పీసీఎల్‌ సహకారంతో రూ.2.5 కోట్ల విలువ చేసే అత్యవసర పరికరాలు సమకూరుస్తున్నామన్నారు. క్యాజువాలిటీ విస్తరించి కౌంటర్లు, వెయిటింగ్‌ హాల్స్‌, లాకర్లు ఏర్పాటు చేశామన్నారు. భావనగర్‌, రాజేంద్రప్రసాద్‌ వార్డులను ఆధునికీకరించామన్నారు. 200 పడకలతో మెడ్రస్‌ చౌల్ట్రీ, రూ.80 లక్షలతో మెడ్రస్‌ మార్చురీ నిర్మించామన్నారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌ కుమార్‌ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధికి ఆమడ దూరంలో కేజీహెచ్‌ ఉండేదన్నారు. కార్యక్రమంలో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, కేజీహెచ్‌ సూపరింటెండెంట్‌ డాక్టర్‌ పి.శివానంద్‌, ఏఎంసీ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ జి.బుచ్చిరాజు, డీఎంహెచ్‌వో డాక్టర్‌ పి.జగదీశ్వరరావు, రిటైర్డు డీఎంఈ డాక్టర్‌ రవిరాజ్‌, అసిస్టెంట్‌ డైరెక్టర్‌ శ్రీనివాస్‌ కుమార్‌, వైద్యులు రాధాకృష్ణ, రాజేంద్రప్రసాద్‌, నవీన్‌, కార్పొరేటర్‌ కోడూరు అప్పలరత్నం, వైఎస్సార్‌ సీపీ నాయకులు పెంటపల్లి సత్యనారాయణ, దశమంతుల మాణిక్యాలరావు, దశమంతుల చిన్ని, ఎస్‌.రాము, రామలక్ష్మి, ఎం.జ్యోతి పాల్గొన్నారు.

క్లుప్తంగా

పెన్సిల్ ముల్లుపై జాతీయ జెండా



మాడుగుల రూరల్: పెన్సిల్ ముల్లుపై జాతీయ జెండా రూపొందించి ఒక గ్రామ వలంటీర్ తన దేశభక్తిని చాటుకున్నాడు. ఎం.కోడూరు గ్రామానికి చెందిన నెయ్యిగొండ గోపాల్ అదే గ్రామంలో వలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ప్రవృత్తిగా సూక్ష్మకళను ఎంచుకున్నాడు. గతంలో కూడా పెన్సిల్ ముల్లుపై అనేక కళాకృతులను సృష్టించాడు.

శరీరసౌష్టవ పోటీల్లో రాణించిన సుధీర్‌కుమార్‌కు ఏఎస్పీ అభినందన



బాడీబిల్డర్ సుధీర్‌కుమార్‌ను అభినందిస్తున్న ఏఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

నర్సీపట్నం : పరవాడలో ఈ నెల 13న జరిగిన మిస్టర్ ఆంధ్ర జోనల్ శరీర సౌష్టవ పోటీల్లో నర్సీపట్నానికి చెందిన కుంచెల సుధీర్‌కుమార్ 77 కిలోల విభాగంలో 5వ స్థానంలో నిలిచాడు. సుధీర్‌కుమార్‌ను ఏఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా సోమవారం అభినందించారు. తన తండ్రి శ్రీనివాసరావు బాడీబిల్డర్‌గా రాణించి పోలీసు శాఖలో పని చేస్తున్నారని, తన తండ్రి వద్ద శిక్షణ పొంది జోనల్ స్థాయి పోటీల్లో రాణించానని సుధీర్‌కుమార్ తెలిపాడు.

గడువులోగా అర్జీలకు 'స్పందన'



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి, అసిస్టెంట్ కలెక్టర్ స్మరణ్‌రాజ్



అర్జీదారునితో మాట్లాడుతున్న జిల్లా అడిషనల్ ఎస్పీ విజయభాస్కర్

- జిల్లా కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి ఆదేశం

తుమ్మపాల: జగనన్నకు చెబుదాం, స్పందన అర్జీలు గడువులోగా విచారణ చేపట్టి పరిష్కరించాలని కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమంలో ఆయనతో పాటు అసిస్టెంట్ కలెక్టర్ స్మరణ్‌రాజ్, డీఆర్డీఏ పీడీ లక్ష్మిపతి, ఇంచార్జి డీఆర్వో అనిత ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తులు, ఫిర్యాదులు చేసిన అర్జీదారులకు స్పష్టమైన సమాధానం ఇవ్వడం ద్వారా సమస్య పరిష్కారంతో పాటు పునరావృతం అయ్యేందుకు అవకాశం ఉండదన్నారు. ఫిర్యాదు అందిన తేదీ నుంచి విచారణ ప్రారంభిస్తే గడువులోగా సమస్యను పరిష్కరించగలమన్నారు. మొత్తం 280 దరఖాస్తులు స్పందనలో నమోదయ్యాయి. అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గిరిజనుల పేరిట పట్టాలివ్వాలి

గిరిజన రైతులు అనేక ఏళ్లుగా సాగుచేస్తున్న భూములను గిరిజనుల పేర్ల మీదనే నమోదు చేసి పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో గొలుగొండ మండలం పాతమల్లంపేట బుడ్డడపాడు గిరిజనులు కలెక్టరేట్ వద్ద తమ నిరసన తెలిపారు. పాతమల్లంపేట సర్వే నం842లో గల భూముల్లో వివిధ పంటలు సాగు చేసుకుంటున్నామని తెలిపారు. రీ సర్వేలో తమ పేర్లను నమోదు చేయకుండా ఇతరుల పేరున ఖాతా నెం.439,440,442,443 లతో పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు చేయడంపై ఆవేదన వ్యక్తం చేశారు. వారిని ఖాతాల నుంచి తొలగించి తమ పేరున పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయాలని కోరుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

రోడ్డు విస్తరణకు నిధులివ్వండి

పాయకరావుపేట ప్రధాన రహదారిని విస్తరించి రెండు లైన్ల రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు అదనపు నిధులు మంజూరు చేయాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతి అందించారు. ప్రస్తుతం ఉన్న ఏడు మీటర్ల వెడల్పు గల రోడ్డుకు రూ.1.50 కోటితో చేపడుతున్న మరమ్మతుల దృష్ట్యా మరో ఐదేళ్ల పాటు రోడ్డు విస్తరణ కలగానే మిగిలిపోతుందన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య దృష్ట్యా అధికారులు రోడ్డు విస్తరణ, అభివృద్ధిపై కార్యాచరణ చేయాలని కోరారు.

ఎస్పీ కార్యాలయానికి 27 అర్జీలు

అనకాపల్లిటౌన్ : చట్టపరిధిలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా అడిషనల్ ఎస్పీ (పరిపాలన) బి.విజయభాస్కర్ అన్నారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందనలో 27 అర్జీలను ఆయన స్వీకరించారు. భూ తగాదాలు, చీటింగ్, కుటుంబ కలహాలపై వచ్చిన అర్జీలు వచ్చినట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో అర్జీలుదారులు, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

సినిమా థియేటర్‌పై ఫిర్యాదు అచ్యుతాపురంలో ఉన్న సినిమా థియేటర్‌లో టికెట్‌లను అధిక ధరలకు అమ్ముతున్నారని, దీనిని వెంటనే నిరోధించాలని పూడిమడకకు చెందిన ఎరిపల్లి కాసులు స్పందనలో జిల్లా కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. థియేటర్‌లో విక్రయించే తినుబండరాల ధరలు అధికంగా ఉంటున్నాయని, పార్కింగ్ ఫీజు అధికంగా వసూలు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

అయ్యన్నకు వైఎస్సార్‌సీపీ సెల్ఫీ చాలెంజ్



మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడికి సెల్ఫీ చాలెంజ్ చేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ

నర్సీపట్నం: మాజీ మంత్రి సిహెచ్.అయ్యన్నపాత్రుడికి వైఎస్సార్‌సీపీ సెల్ఫీ చాలెంజ్ విసిరింది. కొద్ది రోజుల క్రితం అసంపూర్తి నిర్మాణాలపై అయ్యన్నపాత్రుడు సెల్ఫీ చాలెంజ్ విసిరారు. ఈ నేపథ్యంలో ఆయన హయాంలో నిర్మించిన జయభేరి షోరూంపై నర్సీపట్నం మున్సిపల్ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ సెల్ఫీ చాలెంజ్ చేశారు. మున్సిపాలిటీ పరిధి పెద బొడ్డేపల్లి పెదబత్తు చెరువు కాలువను ఆక్రమించి జయభేరి షోరూం నిర్మించింది నిజం కాదా అని సవాల్ విసిరారు. సర్వే నెంబరు 359లో పెదబత్తుడు చెరువు 334 ఎకరాల్లో విస్తరించి ఉందని, 22ఏలో స్పష్టంగా ప్రభుత్వ భూమి అని ఉన్నప్పటికీ అయ్యన్నపాత్రుడు సతీమణి పేరున భూమి కొనుగోలు చేశారన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని ప్రత్యేక సబ్ డివిజన్ చేసి 369/2 సర్వే నెంబర్‌లో 1,170 చదరపు గజాల్లో పంట కాలువను ఆక్రమించి నిర్మించారని రామకృష్ణ ఆరోపించారు.

బూడి కుమారుడి వివాహానికి సీఎం జగన్‌కు ఆహ్వానం



ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి శుభలేఖ అందజేస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దంపతులు

దేవరాపల్లి : రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డిని తాడేపల్లిలోని ఆయన స్వగృహంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధిశాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు, రమణమ్మ దంపతులు సోమవారం కలిశారు. విజయవాడలో సెప్టెంబర్ 2న జరగనున్న తమ కుమారుడు వెంకటేష్ వివాహానికి విచ్చేసి ఆశీర్వదించాలని ముఖ్యమంత్రి దంపతులను వారు ఆహ్వానించారు. సీఎంకు శుభలేఖతో పాటు జ్ఞాపికను అందజేశారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో డిప్యూటీ సీఎం దంపతులతో పాటు కుమార్తె, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, కుమారుడు వెంకటేష్, వైఎస్సార్‌సీపీ మండల మహిళా అధ్యక్షురాలు రొంగలి నారాయణమ్మ ఉన్నారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట

- మంత్రి అమర్‌నాథ్
- వేట జంగాలపాలెంలో విలేజ్ హెల్త్ క్లినిక్‌కు ప్రారంభోత్సవం



సుందరయ్యపేటలో వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లి రూరల్ : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యమిచ్చి సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలో ఎన్నో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. సోమవారం అనకాపల్లి వేటజంగాల పాలెంలో రూ.25 లక్షలతో కొత్తగా నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్, సుందరయ్యపేటలో రూ.25 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్‌లను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గడచిన నాలుగేళ్లలో విద్య, వైద్య రంగాలపై సీఎం జగన్ ప్రత్యేక దృష్టి సారించి దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టని విధంగా ఎన్నో సంస్కరణలు అమలు చేశారన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, వెల్‌నెస్ సెంటర్‌ల ఏర్పాటుతో పాటుగా ఫ్యామిలీ డాక్టర్ విధానంతో రోగుల వద్దకే వెళ్లి వైద్యం అందించే విధంగా సరికొత్త విధానానికి శ్రీకారం చుట్టారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలందించడానికి విలేజ్ హెల్త్ క్లినిక్‌ల్లో అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచుతున్నట్లు మంత్రి తెలిపారు. ప్రాథమిక వైద్యానికి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సూరిబాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దిలీప్ కుమార్, సర్పంచ్‌లు నాగరాజు, నాగేశ్వరరావు, సుందరయ్యపేట ఎంపీటీసీ వెంకటేష్, బొడ్డు యాకబ్, మడక అప్పారావు, సురేష్, తాతారావు, ఎరుకునాయుడు, ఎంపీడీవో నరసింహారావు, డాక్టర్ తిరుమలరావు, డాక్టర్ పావని పాల్గొన్నారు.

ఆహార కల్తీకి పాల్పడితే క్రిమినల్ కేసులు

- జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు రవి కుమార్, శ్రీజ వెల్లడి
- దేవరాపల్లిలో దుకాణాల ఆకస్మిక తనిఖీలు



దేవరాపల్లిలో దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న జిల్లా ఆహార, కొలతలు తనిఖీ అధికారుల బృందం

దేవరాపల్లి : తూనికల్లో అక్రమాలకు పాల్పడినా, ఆహార కల్తీకి పాల్పడినా సదరు దుకాణాల యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అనకాపల్లి జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు బి.రవి కుమార్, ఎస్.శ్రీజ హెచ్చరించారు. మండల కేంద్రంలో సోమవారం మధ్యాహ్నం పలు కిరాణా దుకాణాల్లో ఫుడ్‌ఇన్‌స్పెక్టర్లతో పాటు తూనికలు, కొలతలు తనిఖీ అధికారి ఎస్.భాస్కర్, సహాయ అధికారి శ్రీనివాస్ ఆకస్మిక తనిఖీలు చేశారు. దుకాణాల్లో విక్రయిస్తున్న పప్పు దినుసులు, బాస్మతి రైస్ సాంపిల్స్‌ను సేకరించారు. ఈ సాంపిల్స్‌ను హైదరాబాద్ నాచారంలోని ఆహార తనిఖీ ల్యాబ్‌కు పంపిస్తామని, వాటిలో ప్రజారోగ్యానికి హాని కలిగించేవిగా నిర్ధారణ అయితే ఆయా షాపు యజమానులపై క్రిమినల్ కేసులతో పాటు రూ. 3 లక్షల నుండి రూ. 5 లక్షల వరకు జరిమానా విధిస్తామని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ విలేకరులకు తెలిపారు. షాపుల్లో జరుగుతున్న ఆహార కల్తీ, తూనికల్లో అక్రమాలపై తనిఖీ చేసేందుకు అధికారుల బృందం దేవరాపల్లికి వచ్చిందని తెలుసుకున్న చాలా మంది దుకాణాల యజమానులు దుకాణాలు మూసివేశారు. దీంతో తెరిచి ఉన్న కొద్ది షాపుల్లోనే అధికారులు తనిఖీలు చేపట్టారు. వారం రోజుల క్రితం ఆకస్మిక తనిఖీలకు దేవరాపల్లి రాగా ఇదే మాదిరిగా షాపులు మూసేశారన్నారు.

పవర్‌లిఫ్టింగ్‌లో నాగజ్యోతికి బంగారు పతకాలు



72 కేజీల విభాగంలో పవర్‌లిఫ్టింగ్ చేస్తున్న నాగజ్యోతి



బంగారు పతకాలు సాధించిన నాగజ్యోతి

- జాతీయ పోటీలకు ఎంపిక

రావికమతం : కొత్తకోట గ్రామానికి చెందిన ఆంగ్ల ఉపాధ్యాయిని పి.వి.ఎం నాగజ్యోతి రాష్ట్ర స్థాయి పవర్‌లిఫ్టింగ్, బెంచ్‌ప్రెస్‌లో బంగారు పతకాలు సాధించింది. ఈ నెల 25 నుంచి 27 వరకూ చత్తీస్‌గఢ్‌లో జరిగే జాతీయ పోటీలకు ఎంపికైంది. ఏపి స్టేట్ పవర్‌లిఫ్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 13న విశాఖలో రాష్ట్ర రెండో డెడ్‌లిఫ్ట్ చాంపియన్‌షిప్, 5వ బెంచ్‌ప్రెస్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో నాగజ్యోతి పాల్గొని ఆ రెండు విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలను సాధించింది. ఈ నెల 25 నుంచి 27 వరకూ చత్తీస్‌గఢ్‌లో జరిగే జాతీయ పోటీలకు ఆమె ఎంపికైంది. దీంతో ఆమెను గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు.

నూకాంబిక హుండీల ఆదాయం లెక్కింపు



అమ్మవారి హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

అనకాపల్లి టౌన్: స్థానిక గవరపాలెంలో నూకాంబిక అమ్మవారి హుండీల ఆదాయం రూ.50,69,097, 40.5 గ్రాముల బంగారం, 490 గ్రాముల వెండి వచ్చినట్లు ఆలయ ఈవో బండారు ప్రసాద్ తెలిపారు. సోమవారం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో మూడు హుండీల ఆదాయం లెక్కింపు నిర్వహించామన్నారు. ఈ ఏడాది జూన్ 1 నుంచి ఈ నెల 13వ తేదీ వరకు భక్తులు కానుకల రూపంలో సమర్పించారన్నారు. ఈ మొత్తం ఆదాయాన్ని గవరపాలెం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దేవదాయ శాఖ ఖాతాలో పట్టణ పోలీస్ ఆధ్వర్యంలో జమ చేశామన్నారు. కార్యక్రమంలో ఆంజనేయ స్వామి దేవస్థానం ఈవో ఎ.జగన్నాథరావు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

పనస ధర ఢమాల్!



మాడుగుల వారపు సంతకు వచ్చిన పనస పండ్లు

మాడుగుల: స్థానిక వారపు సంతలో పనస పండ్లకు గిరాకీ లేదు. సీజన్ దాదాపుగా పూర్తి కావస్తున్నా గిట్టుబాటు ధర లేక గిరి రైతులు నిట్టూర్చారు. కొండలు కోనల్లో చెట్లెక్కి పది కిలోమీటర్ల మేర గిరిజన ప్రాంతం నుంచి నడిచి తీసుకొచ్చామని వాపోయారు. గత వారం రూ.300కు అమ్ముడుపోగా, ఈ వారం రూ.100కు కొనే నాథుడు లేడు. సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కొనుగోలుదారుల కోసం ఎదురు చూసి, తిరిగి తీసుకెళ్లలేక శివారులో ఒక్కొక్క పండు రూ.60కే తెగనమ్ముకున్నారు.

భార్య, కుమార్తెపై హత్యాయత్నం

అనకాపల్లిటౌన్: భార్య, కుమార్తెను భర్త హతమార్చబోయాడంటూ గ్రామీణ పోలీసులకు సోమవారం ఫిర్యాదు అందింది. గ్రామీణ ఎస్ఐ నర్సింగరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. 2011 మే 2న మండలంలో శంకరం గ్రామానికి చెందిన కర్రి లక్ష్మికి అదే గ్రామానికి చెందిన కర్రి శ్రీనివాసరావు అలియాస్ సర్వేశ్వరరావుతో వివాహమైంది. వీరికి తనుసాయిశ్రీ(10) అనే కుమార్తె ఉంది. 2014లో మరో మహిళను శ్రీనివాసరావు పెళ్లి చేసుకున్నాడు. అప్పుడప్పుడు లక్ష్మి ఇంటికి వస్తుంటాడు. గత నెల 30న తనుసాయిశ్రీ చదువుతున్న స్కూల్‌కు శ్రీనివాసరావు వెళ్లాడు. పాపను తన వెంట తీసుకెళ్లి, అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు ఇంటికి వచ్చాడు. అప్పటి నుంచి పాప డిప్రెషన్లోకి వెళ్లిపోయింది. దీనిపై తల్లి ఆరాతీయగా శ్రీనివాసరావు తనతో అసభ్యంగా ప్రవర్తించిన విషయాన్ని బయటపెట్టింది. శ్రీనివాసరావు చేష్టల కారణంగా ఈ నెల 8న రాజమండ్రిలో ఉంటున్న అక్క పితాని లక్ష్మి ఇంటికి వీరు వెళ్లారు. 13న అక్క, బంధువులు దేవి, రత్నకుమారి, త్రినాథ్‌తో కలిసి శంకరం గ్రామానికి చేరుకున్నారు. కుమార్తె విషయమై భర్త శ్రీనివాసరావును నిలదీయగా అక్కడి నుంచి తప్పించుకుని, బయటికి వెళ్లిపోయాడు. అర్ధరాత్రి 2 గంటల సమయంలో ఇంటికి తిరిగి వచ్చి, తాము నిద్రిస్తున్న గదితోపాటు బయట ఉన్న కారుపై పెట్రోల్ పోసి నిప్పు అంటించి పారిపోయాడంటూ కర్రి లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

అనకాపల్లిటౌన్ : స్థానిక దిశ పోలీస్‌స్టేషన్ ముందు సోమవారం ఓ వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. సీఐ టి.లక్ష్మి అందించిన వివరాలిలా ఉన్నాయి. మునగపాక మండలం వాడ్రాపల్లి గ్రామానికి చెందిన మల్ల దివ్య అదే మండలం కించువానిపాలెం గ్రామానికి చెందిన కాయల మురళి ఇద్దరూ 2022 డిసెంబర్ 16న ప్రేమవివాహం చేసుకున్నారు. భార్యాభర్తలిద్దరూ పట్టణంలో చింతావారివీధిలో షాపింగ్‌మాల్లో పని చేస్తున్నారు. భర్త వేరే అమ్మాయితో వివాహేత సంబంధం ఏర్పరుచుకున్నాడని దిశ పోలీస్‌స్టేషన్‌లో గతంలో ఫిర్యాదు చేయగా పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి ఇద్దరినీ కలిపారు. అయితే తనను భర్త తరుచూ వేధిస్తున్నాడని దివ్య పురుగుమందు సేవించి దిశ పోలీస్‌స్టేషన్‌కు వచ్చింది. అప్పటికే అపస్మారకస్థితిలో ఉన్న దివ్యను స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించగా అక్కడి నుంచి విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ఈ మేరకు గతంలో దివ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త మురళిపై కేసు నమెదు చేసినట్టు సీఐ చెప్పారు.

మినీ జాబ్‌మేళాలో 20 మంది ఎంపిక



నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ప్రైవేట్ కంపెనీ ప్రతినిధులు

అనకాపల్లిటౌన్ : మండలంలో రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో నిరుద్యోగ యువతీ యువకులకు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఇంటర్వ్యూలు జరిగాయి. నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి టి.చాముండేశ్వరరావు మాట్లాడుతూ మినీ జాబ్‌మేళా నిర్వహించామని, ఈ మేళాలో మూడు ప్రైవేట్ కంపెనీలు ప్రతినిధులు హాజరై నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. 18 నుంచి 40 సంవత్సరాలు వయస్సు కలిగిన యువతీ యువకులు మేళాలో పాల్గొన్నట్టు చెప్పారు. 95 మంది నిరుద్యోగులు హాజరుకాగా, 20 మందిని ఎంపిక చేయడం జరిగిందన్నారు.

సెలూన్ నిర్వాహకుడి ఆత్మహత్య!



సత్తిబాబు (ఫైల్)

పరవాడ : దేశపాత్రునిపాలెంలో సెలూన్ షాపు నిర్వాహకుడు బి.సత్తిబాబు బలవన్మరణానికి పాల్పడినట్టు పరవాడ పోలీసులు చెప్పారు. ఎస్ఐ సిరపరపు సురేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బుచ్చెయ్యపేట మండలం బుదిరెడ్లపాలేనికి చెందిన బయ్యవరపు సత్తిబాబు (30) తొమ్మిదేళ్ల కిందట దేశపాత్రునిపాలెం వలస వచ్చాడు. కొన్నాళ్ల పాటు స్థానికంగా ఉన్న సెలూన్ షాపుల్లో పనిచేసి వివాహం అనంతరం మెయిన్‌రోడ్‌లో సొంతంగా సెలూన్ షాపు నిర్వహిస్తున్నాడు. సత్తిబాబుకు భార్య, ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. భార్యా భర్తల మధ్య మనస్పర్థలు రావడంతో భార్య పిల్లలను తీసుకొని పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి సత్తిబాబు ఒక్కడే ఇంట్లో ఉంటున్నాడు. ఇదిలావుండగా సోమవారం మధ్యాహ్నం తలుపులు వేసి ఉన్న ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలాన్ని సందర్శించిన పోలీసులు సత్తిబాబు కుటుంబ కలహాల వల్లే ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు. ఎస్ఐ సురేష్ ఘటన స్థలాన్ని సందర్శించి క్లూస్‌టీంకు సమాచారం అందించారు. క్లూస్ టీం బృందం నేర స్థలిలో వేలి ముద్రలను సేకరించింది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సురేష్ చెప్పారు.

జేవీవీ జిల్లా అధ్యక్షుడిగా నాగచంద్ర



మాడుగుల: జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడిగా మాడుగుల గ్రామానికి చెందిన తాళ్లపురెడ్డి నాగచంద్రను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం రాత్రి స్థానిక పాల కేంద్రంలో జేవీవీ కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు డివిజన్ అధ్యక్షుడు సురేష్ శాంతో సోమవారం తెలిపారు. కార్యదర్శిగా గౌరీపట్టపు మహేష్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా రామ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా అంజలి, సభ్యులుగా రమేష్, శ్యామల, పద్మజ, కె.స్వామి, అపర్ణదేవి, అరవింద్, మూర్తిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారన్నారు.

క్లుప్తంగా

సంపతిపురంలో 'గడప గడపకు' రేపు

అనకాపల్లిటౌన్: మండలంలోని సంపతిపురం గ్రామంలో బుధవారం ఉదయం 8 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖల మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రభుత్వ విభాగాల ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరుకావాల్సిందిగా కోరారు.

జెండా పండగ సందడి



కశింకోటలో ఓ దుకాణం ముందు విక్రయిస్తున్న జాతీయ పతాకాలు

కశింకోట: స్థానిక దుకాణాల్లో స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని జాతీయ జెండాలు, స్టిక్కర్లు, బ్యాడ్జిల అమ్మకాలు సోమవారం జోరుగా సాగాయి. మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవం కావడంతో పెద్దలు, పిల్లలు, విద్యార్థులు ఆసక్తిగా కొనుగోలు చేశారు. గతంలో జాతీయ జెండాలను పాఠశాలలు, ప్రభుత్వ సంస్థల్లో ఎగుర వేసేవారు. ఇపుడు ఇళ్ల వద్ద కూడా ఎగుర వేయాలని ప్రభుత్వం సూచించడంతో క్లాత్ జెండాలను ఎక్కువగా కొనుగోలు చేశారు.

మార్షల్ ఆర్ట్స్‌లో ప్రతిభ



రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన స్కై మార్షల్ ఆర్ట్స్ క్రీడాకారులు

తుమ్మపాల: ఈ నెల 13న శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో జిల్లాకు చెందిన స్కై మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ క్రీడాకారులు సిల్వర్ పతకాలు సాధించినట్లు ప్రెసిడెంట్ వనం సన్యాసిరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందిన ఎస్.కార్తీక్, జి.మోహనఅర్జున్, కళ్యాణ్‌రాజ్‌లు సిల్వర్ మెడల్, ఎ.కుమార్ నాయుడు, కె.వంశీ, పి.అరుణ్‌కుమార్, బి.లోహిత, కె.జాయిబాబు, ఎస్.ప్రసాద్, కె.హర్షవర్ధన్, ఆర్.జ్యోతిక్‌లు బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు వెల్లడించారు. వారిని అసోసియేషన్ సభ్యులు వై.రాజు, జి.దేవీవరలక్ష్మి, రమేష్, ప్రసాద్, షిమోన్‌లు అభినందించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 208 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,020	4,290
రెండో రకం	3,850	3,900
మూడోరకం	3,600	3,920

అనకాపల్లి సినిమాలు

బేబి	:	రాజా
భోళాశంకర్	:	సత్యనారాయణ స్క్రీన్-1
ఉస్తాద్	:	సత్యనారాయణ స్క్రీన్-2
జైలర్	:	షిర్డిసాయి
భోళాశంకర్	:	పర్తిసాయి
భోళాశంకర్	:	వెంకటేశ్వర
భోళాశంకర్	:	శ్రీసత్య
బ్రో	:	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్త నిధి కేంద్రంలో 23 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-5 యూనిట్లు, ఓ పాజిటివ్-15 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు ప్రతినిధి గంగయ్య (9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 428 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 394 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

అతివల ఆర్థిక స్వావలంబనే ధ్యేయం

- డ్వాక్రా మహిళలకు ప్రభుత్వ వరం.. సున్నా వడ్డీ
- నియోజకవర్గంలో 39,813 మంది మహిళలకు లబ్ధి
- నాలుగేళ్లలో రూ.11.78 కోట్లు జమ చేసిన ప్రభుత్వం

అతివలు ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. చిరు వ్యాపారం నుంచి నలుగురికి ఉపాధినిచ్చే పరిశ్రమలు నెలకొల్పేలా వివిధ రంగాల్లో వారికి సీఎం జగన్ తోడ్పాటునందిస్తున్నారు. మహిళలు వంటింటికి పరిమితం కారాదని, కుటుంబానికి భరోసాగా నిలవాలని సున్నా వడ్డీని క్రమం తప్పకుండా అమలు చేస్తున్నారు. వరుసగా నాలుగో ఏడాది వడ్డీ రాయితీని అందించి, ఆసరాగా నిలిచారు.



సున్నా వడ్డీ పథకం గురించి మహిళలకు వివరిస్తున్న డీఆర్‌డీఏ అధికారి



సమావేశమైన డ్వాక్రా సంఘాల మహిళలు

అనకాపల్లి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి మహిళాభ్యున్నతికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది. ఇప్పటికే వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, జగనన్న మహిళా మార్టులు, ఆహా క్యాంటీన్లు, బ్యాంకు లింకేజీ రుణాలు, స్త్రీనిధి వంటి పథకాలతో వారిని అక్కున చేర్చుకుంది. వీటితోపాటు స్వయం సహాయక సంఘాల్లో రుణాలు పొంది, క్రమం తప్పకుండా చెల్లించిన వారికి వడ్డీ రాయితీని ఠంచనుగా చెల్లిస్తోంది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాలుగో ఏడాది కూడా(ఈ నెల 11న) సీఎం జగన్ బటన్ నొక్కడంతో మహిళల ఖాతాల్లో సున్నావడ్డీ జమ అయింది.

39,813 మందికి లబ్ధి

అనకాపల్లి నియోజకవర్గంలోని అనకాపల్లి, కశింకోట మండలాల్లో 3,593 మహిళా సంఘాల్లో 39,813 మంది సభ్యులు ఉన్నారు. సున్నా వడ్డీ రాయితీ కింద నాలుగేళ్లలో ఆయా సంఘాల ఖాతాలకు రూ.11.78 కోట్లు నాలుగు విడతల్లో ప్రభుత్వం జమ చేసింది. ఈ నెల 11న విడుదల చేసిన నాలుగో విడతలో రూ.4.69 కోట్లు నగదును సీఎం జగన్ నేరుగా బటన్ నొక్కి సంఘాల ఖాతాల్లో వేశారు. గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి నెలాఖరు వరకు రుణాలను సక్రమంగా చెల్లించిన గ్రూపులకు ఈ సున్నా వడ్డీని ప్రభుత్వం అందించింది. గతంలో టీడీపీ ప్రభుత్వం 2016 నుంచి సున్నా వడ్డీని పక్కన పెట్టింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సున్నా వడ్డీని ఠంచనుగా అందిస్తూ స్వయం సహాయక సంఘాల మహిళలను ఆదుకుంటోంది.

నియోజకవర్గంలో సున్నా వడ్డీ జమ

మండలం	గ్రూపులు	సభ్యులు	నగదు జమ రూ. కోట్లలో
అనకాపల్లి	1924	21630	6.09
కశింకోట	1669	18183	5.69
మొత్తం	3593	39813	11.78

మాట తప్పని నేత జగన్



పొదుపు మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు సీఎం జగనన్న ఎంతగానో తోడ్పాటు అందిస్తున్నారు. మహిళల సంక్షేమం కోసం జగనన్న అమలు చేస్తున్న పథకాలు కష్టాల్లో ఆదుకుంటున్నాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తూ మహిళల సంక్షేమానికి కృషి చేస్తోన్న జగనన్నకే మా మద్దతు. ఇచ్చిన మాటను కరోనా లాంటి కష్ట సమయంలో కూడా అమలు చేసి, మాట తప్పని నేతగా నిరూపించుకున్నారు.

– శెలపరెడ్డి మహేశ్వరి, డ్వాక్రా సంఘం సభ్యురాలు

మహిళలకు అండగా సీఎం



మా గ్రూపులో 11 మంది సభ్యులున్నాం. సున్నా వడ్డీ పథకం ద్వారా రూ.21 వేలు నా ఖాతాలో జమ అయింది. వరుసగా నాలుగో ఏడాది కూడా క్రమం తప్పకుండా వడ్డీ రాయితీ ఇచ్చారు. జగన్ సీఎం అయినప్పటి నుంచి మహిళాభ్యున్నతికి కృషి చేస్తున్నారు. రాజకీయాలకు అతీతంగా అన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. బ్యాంకులు కూడా మాకు రుణాలు ఇస్తున్నాయి. దీంతో సభ్యుల ఆర్థికాభివృద్ధికి ఉపయోగపడుతోంది.

– బొద్దపు అమ్మాజీ, నూకాంబిక గ్రూపు

సున్నా వడ్డీ మహిళలకు వరం



క్రమం తప్పకుండా బ్యాంకు రుణాలు చెల్లిస్తున్న డ్వాక్రా సంఘాల సభ్యులకు ప్రభుత్వం ఏటా సున్నా వడ్డీ రుణాలను అందిస్తోంది. దీంతో మహిళలు సకాలంలో రుణాల వాయిదాలను బ్యాంకులకు చెల్లిస్తున్నారు. సున్నా వడ్డీ డ్వాక్రా సభ్యులకు గొప్ప వరం. వడ్డీ రాయితీ లభిస్తుండటం వలన మహిళలపై రుణ భారం తగ్గుతోంది. ఇలాంటి పథకాలు మహిళా సంఘాలను బలోపేతం చేస్తాయనడంలో సందేహం లేదు.

– కె.నీలాచలం, ఏపీఎం, అనకాపల్లి

సంక్షేమానికి కేరాఫ్ సీఎం జగన్



వేట జంగాలపాలెంలో గ్రామస్తుల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్



వృద్ధురాలిని పింఛన్ పంపిణీ గురించి అడిగి తెలుసుకుంటున్న మంత్రి అమర్‌నాథ్

- వేట జంగాలపాలెం వీధుల్లో డ్రైనేజీల నిర్మాణానికి ఆదేశం
- నవరత్నాల శతశాతం అమలే మళ్లీ మా ప్రభుత్వాన్ని గెలిపిస్తాయి
- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లి రూరల్: దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఏపీలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని, ఈ పథకాలే చాలా రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మండలంలోని వేట జంగాలపాలెం గ్రామంలో సోమవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ లబ్ధిని వివరించి, అందుకు సంబంధించిన పథకాలతో ముద్రించిన బుక్‌లెట్‌లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికి వీలవుతోందన్నారు.

రాబోయే ఎన్నికల్లో నవరత్నాల శత శాతం అమలే మళ్లీ తమ ప్రభుత్వాన్ని గెలిపిస్తాయన్నారు. గత టీడీపీ పాలనకు, నాలుగేళ్ల సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనకు తేడాను గమనించాలని ప్రజలను కోరారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ఎంతో పారదర్శకంగా అవినీతికి తావు లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం జగనన్నకే దక్కిందన్నారు. జగనన్న కాలనీలకు గతంలో చేపట్టిన ల్యాండ్ పూలింగ్‌లో భూములు ఇచ్చిన రైతులకు, పరిహారంగా ఇచ్చిన భూమికి త్వరలోనే ఉచిత రిజిస్ట్రేషన్ చేయిస్తామని హామీ ఇచ్చారు.

ఈ సమస్యను ఇప్పటికే సీఎం దృష్టికి తీసుకెళ్లామని, రైతులందరికీ న్యాయం చేయడానికి సీఎం సమ్మతించారని తెలిపారు. ఇందుకు సుమారు రూ.65 కోట్లు ఖర్చవుతుందన్నారు. దీనికి సంబంధించి త్వరలోనే ప్రభుత్వ ఉత్తర్వులు విడుదలవుతాయని మంత్రి వెల్లడించారు.

వేట జంగాలపాలెం గ్రామంలో అవసరమైనచోట మురుగునీటి కాల్వలు నిర్మించడానికి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను మంత్రి ఆదేశించారు. గత ప్రభుత్వాలు గ్రామాలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తే తాము ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేసి ప్రజలకు చేరువగా ప్రభుత్వ సేవలను, మౌలిక సదుపాయాలను తీసుకొచ్చామన్నారు. పేద ప్రజల సంక్షేమానికి నిరంతరం శ్రమించే సీఎం జగనన్నకు మద్దతుగా ఉండి మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాల్సిందిగా అభ్యర్థించారు.

కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, సర్పంచ్‌లు గూన నాగరాజు, రాపేటి నాగేశ్వరరావు, ఎంపీటీసీ రాపేటి వెంకటేష్, బొడ్డు యాకూబ్, మడక అప్పారావు, సురేష్, బాదపు తాతారావు, ఇసరపు ఎరుకునాయుడు, ఎంపీడీవో కేవీ నరసింహారావు, డీఆర్‌డీఏ ఏపీఎం నీలాచలం, తగరంపూడి పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ తిరుమలరావు, డాక్టర్ జి.పావని, పలువురు అధికారులు, వైఎస్సార్‌సీపీ గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు



కశింకోటలో తిరంగా ర్యాలీలో విద్యార్థులు

అనకాపల్లిటౌన్: పంద్రాగస్టును పురస్కరించుకుని దేశవ్యాప్తంగా ప్రతీ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపరెడ్డి పరమేశ్వరరావు అన్నారు. హర్ ఘర్ తిరంగా వేడుకల్లో భాగంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వాతంత్ర్య సమరయోధుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అనంతరం అమరవీరులకు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు గేదెల స్వరూప్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొణతాల రాజబాబు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చదరం నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు ఉడా రమేష్, అసెంబ్లీ కన్వీనర్ బొడ్డేడ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కశింకోట: కశింకోటలో విద్యార్థులు సోమవారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఘర్ ఘర్ తిరంగాలో భాగంగా స్థానిక వివేకానంద స్కూల్, కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. భారతమాతాకీ జై, వందేమాతరం అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు మాట్లాడుతూ ప్రధాని మోదీ పిలుపు మేరకు ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగుర వేసి దేశభక్తిని చాటాలని కోరారు. పార్టీ జిల్లా కోశాధికారి ఎం.ఎం.నాయుడు, స్కూల్ కరస్పాండెంట్ మళ్ల జగదీష్, బీజేపీ నాయకుడు నడిపల్లి సన్యాసిరావు, శిష్టి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా ఆజాదీకా అమృత్ మహోత్సవ్



ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

అనకాపల్లిటౌన్: ఆజాదీకా అమృత్ మహోత్సవ్ వేడుకల్లో భాగంగా మండలంలోని గోపాలపురంలో సోమవారం నిర్వహించిన నా భూమి – నా దేశం కార్యక్రమంలో పాల్గొని నేల తల్లికి నమస్కారం.. వీరులకు వందనమంటూ ఎంపీపీ గొర్లి సూరిబాబు మొక్కలు నాటారు. అంతకు ముందు అమర వీరుల స్థూపాన్ని ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ ద్వారా నివాళులర్పించారు. గ్రామ సర్పంచ్ జెర్రిపోతుల లక్ష్మి, ఏపీవో సుప్రియ, సచివాలయ ఉద్యోగులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ వేడుకలు



విద్యార్థినికి బహుమతి అందిస్తున్న ఎస్ఐ సింహాచలంనాయుడు

అనకాపల్లిటౌన్: స్థానిక రోటరీ క్లబ్‌లో ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జెండాను సంఘ ప్రతినిధులు ఆవిష్కరించారు. అంతకు ముందు వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విజేతలకు పట్టణ ఎస్ఐ సింహాచలంనాయుడు చేతుల మీదుగా బహుమతులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా సంబంధ పోరాటాల్లో ఏఐఎస్ఎఫ్ అలుపెరుగని పోరాటాలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నేతలు, విద్యార్థులు పాల్గొన్నారు.

మళ్లీ ఆగిన కుళాయి నీటి సరఫరా

కశింకోట: స్థానిక పంచాయతీ పరిధిలో రెండు రోజులుగా కుళాయిల నుంచి మంచినీరు సరఫరా కావడం లేదు. దీంతో తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గురు, శుక్రవారాల్లో కూడా పైపులైన్ మరమ్మతుల వల్ల కుళాయి నీరు సరఫరా కాలేదు. శనివారం మరమ్మతులు పూర్తి చేసి, నీరందించారు. అది కూడా ఒక్క రోజు ముచ్చటే అయింది. ఆదివారం నుంచి షరా మామూలే. కుళాయిల నుంచి నీటి సరఫరా లేకపోవడం, గ్రామం అంతటా దాదాపుగా ఉప్పు నీరే లభించడంతో తాగునీటికి కటకటలాడుతున్నారు. కుళాయి నీరు తప్ప మరే దారీ లేదని స్థానికులు వాపోతున్నారు. శారదానది అవతల ఉన్న ప్రధాన పైపులైన్ దెబ్బతినడం వల్లే నీటి సరఫరా నిలిచిపోయిందని పంచాయతీ కార్యదర్శి ఎన్.రమేష్ తెలిపారు.

పాత పైపులైన్ కావడం వల్ల తరచూ మరమ్మతులకు లోనై, నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందన్నారు. మరమ్మతులు పూర్తి చేసి, మంగళవారం నుంచి నీటి సరఫరాను పునరుద్ధరించనున్నట్లు పేర్కొన్నారు.



కశింకోటలో నీరు రాక బోసిపోయి ఉన్న కుళాయి

ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ర్యాలీ



నెహ్రూచౌక్ వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు

అనకాపల్లిటౌన్: దేశంలో గత, ప్రస్తుత దుర్ఘటనలను దృష్టిలో పెట్టుకుని కులమత భేదాల్లేని స్వతంత్ర భారతావని కావాలంటూ ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ప్రతినిధుల ఆధ్వర్యంలో విద్యార్థులు పట్టణంలోని పలు ప్రాంతాల్లో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ శివాజీ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధులు ఎన్నో పోరాటాలు చేసి, దేశానికి స్వాతంత్ర్యం తీసుకువస్తే దేశ ప్రజలకు వాటి ఫలాలు ఇప్పటికీ పూర్తి స్థాయిలో అందడంలేదని వాపోయారు. విద్య, వైద్యం, ఉపాధి కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రమణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానం వల్ల వెనకబడిన వర్గాల విద్యార్థులు విద్యకు దూరమవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కోశాధికారి గొర్లి తరుణ్, సభ్యులు బాలాజీ, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంప్లెక్స్ మీదుగా బస్సుల్ని నడపాలని వినతి



ఆర్టీసీ జిల్లా అధికారి పద్మావతికి వినతిపత్రం అందిస్తున్న బల్లా నాగభూషణం

అనకాపల్లిటౌన్: జిల్లా ప్రజా రవాణా శాఖ(ఆర్టీసీ) కాంప్లెక్స్‌లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలంటూ జిల్లా అధికారి కె.పద్మావతికి సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ నుంచి అనకాపల్లి మీదుగా వెళ్లే అన్ని బస్సులను అనకాపల్లి కాంప్లెక్స్‌కు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. విశాఖ-అనకాపల్లి సిటీ జనరల్ బస్‌పాస్‌లు ఇవ్వాలని, కాంప్లెక్స్ ఆవరణలో కుర్చీలు ఏర్పాటు చేయాలని తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. వినతి పత్రం అందించిన వారిలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వినకోట నీలేష్ గుప్తా, కార్యవర్గ సభ్యులు రొబ్బి మల్లేశ్వరరావు, పటాన్ల కృష్ణ మోహన్‌రావు, దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బుగిడి నూకఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జెండా పండగకు సన్నద్ధం

కశింకోట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 9 గంటలకు స్వాతంత్ర్య దిన వేడుకలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సోమవారం ఓ ప్రకటనలో వి.వి.రవికుమార్ తెలిపారు. ఎంపీపీ కలగా లక్ష్మి జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారన్నారు. తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్, పాఠశాలలు, పీహెచ్‌సీలు, ఇతర సంస్థల్లో స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ముత్యాలమ్మపాలెం పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

పరవాడ: పలు ఆరోపణల నేపథ్యంలో మండలంలోని ముత్యాలమ్మపాలెం గ్రామ పంచాయతీ కార్యదర్శి జి.సోమినాయుడును సస్పెండ్ చేస్తూ అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇంటి పన్నులు వేయిస్తానని చెప్పి గ్రామంలో పలువురి నుంచి డబ్బులు వసూలు చేశారని గ్రామానికి చెందిన బొంది దుర్గాలు అనే వ్యక్తి జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు జాయింట్ కలెక్టర్ జాహ్నవి విచారణ జరిపారు. సదరు విచారణలో పంచాయతీ కార్యదర్శి సోమినాయుడు లంచం కాదని.. పలువురు డబ్బులు ఇస్తే తీసుకున్నానని చెప్పడంతో సోమినాయుడుపై చర్యలు కోసం జేసీ జాహ్నవి నివేదిక కలెక్టర్‌కు సమర్పించారు. జేసీ నివేదిక ఆధారంగా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి పంచాయతీ కార్యదర్శి సోమినాయుడును సస్పెండ్ చేశారు. విచారణ పూర్తయ్యే వరకు సస్పెన్షన్ ఉత్తర్వులు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు.

వారి పోరాటాలు స్ఫూర్తిదాయకం

సబ్బవరం: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నా భూమి-నా దేశం కార్యక్రమంలో భాగంగా మొగలిపురంలోని మల్లునాయుడు చెరువు గట్టుపై సోమవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ముందుగా గ్రామ పెద్దలు, నాయకులతో కలిసి సచివాలయ సిబ్బంది, వలంటీర్లు గట్టుపై శిలాఫలకం ఆవిష్కరించి అనంతరం మట్టితో ప్రతిజ్ఞ చేశారు. స్వాతంత్ర్య సమరయోధులు, అమరవీరుల త్యాగాలు, దేశ సమైక్యత, సంస్కృతి, సాంప్రదాయాలు గురించి చర్చించారు. భావితరాలకు ఈ కార్యక్రమాలు స్ఫూర్తిగా నిలవాలని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.